వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 313 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | మే 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|



## తెలంగాణలో లిక్కర్ ధరలు పెంపు..!

- క్వార్టర్‌కు రూ.20, ఫుల్ బాటిల్‌కు రూ.40 నేటి నుంచి అమల్లోకి

హైదరాబాద్
మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్కో బీర్ బాటిల్‌పై రూ.30 పెంచిన ప్రభుత్వం తాజాగా మద్యం ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మద్యం సరఫరా కోసం లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో ధరల కమిటీ సిఫారసు, మద్యం కంపెనీల విజ్ఞప్తి మేరకు రేట్లను పెంచినట్టు భావిస్తున్నారు. విస్కీ, బ్రాందీ క్వార్టర్‌పై రూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున ధరలను పెంచింది. ఈ మేరకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదివారం సర్క్యులర్ జారీ చేసింది.

-మిగతా 3 లో





# పాతబస్తీలో అగ్నిప్రమాదం

8 మంది చిన్నారులు, 9 మంది పెద్దలు, వృద్ధులు మృతి

### ఊపిరాడక 17 మంది మృతి

- చార్మినార్ సమీపంలో అత్యంత హృదయ విదారక ఘటన
- ఏసీ కంప్రెషర్ పేలి కిందంతస్తులో మంటలు
- తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లిన సహాయక సిబ్బంది
- రోబోతో మంటలు అదుపులోకి..
- ఒక్కొక్కరికి రూ. ఐదులక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం..
- ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- ఘటనా స్థలిని సందర్శించిన కేంద్ర, రాష్ట్రమంత్రులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పీఎం మోడీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ తదితరులు

హైదరాబాద్
హైదరాబాద్‌లోని చార్మినార్‌కు అతి సమీపంలో గుల్జార్‌హౌస్ వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకున్న అత్యంత హృదయ విదారక ఘటనలో 17 మంది అగ్నికి ఆహుతయ్యారు. 8 మంది చిన్నారులు, 5గురు మహిళలు, 4 గురు పురుషులు మృతిచెందారు. చనిపోయినవారంతా ఒకే కుటుంబానికి చెందినవారు, బంధువులు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర

-మిగతా 3 లో







# లోతుగా దర్యాప్తు చేయండి

## అసలైన కారణాలను కనుక్కోండి



- గుల్జార్ హౌజ్ దుర్ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి
- కుటుంబ సభ్యులకు సానుభూతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్
హైదరాబాద్‌లోని గుల్జార్ హౌజ్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ ప్రమాదానికి గల అసలైన కారణాలను తెలుసుకునేందుకు వీలుగా లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు.

-మిగతా 3 లో



## పాక్‌లో లష్కరే అగ్రనేత హతం

సైఫుల్లాను కాల్చి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు
భారత్‌లో మూడు ప్రధాన ఉగ్రదాడులకు సూత్రధారి

న్యూఢిల్లీ
పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతమయ్యాడు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు సైఫుల్లా ఖలీద్‌ను మట్టుబెట్టినట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వార్తా సంస్థ పీటీఐ నివేదించింది.ఇండియాలో జరిగిన మూడు ఉగ్రదాడుల్లో సైఫుల్లా ఖలీద్ కీలకంగా వ్యవహరించాడు. 2001లో రాంపూర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడి చేశాడు. బెంగళూరులో 2005లో నిర్వహించిన

-మిగతా 3 లో



## గాజాపై ఆగని ఇజ్రాయిల్ విధ్వంసం..

తాజాగా 135 మంది మృతి

రఫా
ఇజ్రాయిల్- హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో టెల్ అవీవ్ గాజాపై భీకర దాడులను కొనసాగిస్తోంది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మందితో పాటు మొత్తం 103 మంది మరణించారని

-మిగతా 3 లో



## బీర్లను, బార్లను నమ్ముకొని రాష్ట్రంలో పాలన

మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్
రాష్ట్ర ప్రభుత్వం బీర్లను, బార్లను నమ్ముకుని పాలన కొనసాగిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మద్యంపై రాద్ధాంతం చేసిన నేతలే, నేడు ఆదే మద్యం ధరలు పెంచి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రకటించిన కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఎక్సైజ్ విధానాన్ని పున్ణ పరిశీలించి

-మిగతా 3 లో



## పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగం విఫలం..

మూడవ దశలో సాంకేతిక లోపం

శ్రీహరికోట... 

స్రూళ్లూరుపేట
తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు నిర్వహించిన పిఎస్ఎల్వి-సి61 ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో చైర్మెన్ వి నారాయణన్ ప్రకటించారు. పీఎస్ఎల్వీ రాకెట్ సాయంతో ఇఒఎస్ 09 శాటిలైట్‌ను భూమికి 529

-మిగతా 3 లో

## 17 మంది ఎంపీలకు సంసద్ రత్న అవార్డులు

- రెండు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు కూడా..

న్యూఢిల్లీ
భర్తృహరి మహతాబ్, రవి కిషన్‌తో సహా మొత్తం 17 మంది పార్లమెంట్ సభ్యులకు సంసద్ రత్న అవార్డులు ప్రకటించారు. అలాగే రెండు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలు కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. పార్లమెంట్‌కు చేసిన కృషికి గానూ ఎంపీలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఈ అవార్డులను ఏర్పాటు చేసింది. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ (ఎన్‌సీబీసీ) చైరెన్ హన్స్‌రాజ్ అహిర్ నేతృత్వంలోని

-మిగతా 3 లో





## డ్రగ్స్ నివారణకు మా మద్దతు

-సీసీసీని సందర్శించిన సందర్భంగా మిస్ వరల్డ్ పోటీదారులు
-మత్తు మందు నివారణ పోస్టర్లపై సంతకాలు, మెస్సేజ్‌లు

హైదరాబాద్
డ్రగ్స్ నివారణ కోసం తెలంగాణా పోలీస్ చేపట్టిన చర్యలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని 107 దేశాల మిస్‌వరల్డ్ పోటీదారులు ప్రకటించారు. ఈ మేరకు మత్తు మందు నివారణ పోస్టర్లపై సంతకాలు, మెస్సేజ్‌లు రాశారు. ఆదివారం వారు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. సీసీసీకి చేరుకున్న వారికి పోలీస్ అశ్విక దళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్, స్నిప్పర్ డాగ్ స్క్వాడ్‌లతో

-మిగతా 3 లో

# ఆందోళన రేకెత్తిస్తున్న కరోనా వేరియంట్..

## కేసులు పెరుగుతుండడంతో కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం..!



**ఢిల్లీ మే 18 ప్రజా స్వేచ్ఛ**
ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆసియా ఆదేశాల్లో (హాంకాంగ్-సింగపూర్) పెరుగుతున్న కరోనా కేసులు ఆరోగ్య నిపుణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. గత కొన్ని వారాల్లో కరోనా కేసులు గణనీయంగా పెరిగాయని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కరోనా ఇన్ఫెక్షన్ కేసులు పెరగడమే కాకుండా చాలాచోట్ల ఆసుపత్రుల్లో చేరే రోగుల సంఖ్య పెరిగింది. ఈ పెరుగుతున్న కేసులకు కొత్త వేరియంట్ కారణమని ఇప్పటి వరకు నిపుణులు ప్రకటించలేదు. అయితే, వ్యాక్సిన్ రోగనిరోధక శక్తి తగ్గుతోందని, ఫలితంగా వైరస్ ప్రభావం మరోసారి కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగా కరోనాకు బూస్టర్ వ్యాక్సిన్ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా రక్షణ ఉంటుందన్నారు.గతంలో ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని పలు ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. ఆగ్నేయాసియాలోని అనేక ప్రాంతాలలో కోవిడ్-19 కొత్త వేరియంట్ తర్వాత ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ వైరస్ మరోసారి వినాశనం కలిగించబోతోందా? కోవిడ్-19 నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి మనమందరం మునుపటిలాగే చర్యలు తీసుకోవాలా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. హాంకాంగ్, సింగపూర్ వంటి నగరాల్లో ఆసుపత్రిలో చేరడం, మరణాలతో పాటు కొత్త కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దాదాపు సంవత్సరం తర్వాత తొలిసారిగా కేసులు పెరుగుతున్నాయి. అనేక దేశాలలో పెరుగుతున్న ప్రమాదాలను చూసి, ఆరోగ్య సంస్థలు ప్రజలను అప్రమత్తం చేశాయి. మరో వైపు పెరుగుతున్న ముప్పు మధ్య యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌ను ఆమోదించింది. అమెరికాకు చెందిన నెబ్రాస్కా మెడిసిన్‌లో అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఈ రూప్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఎల్‌పీ.8.1 వేరియంట్ ద్వారా కేసులు పెరుగుతున్నాయన్నారు. 70శాతం కేసులకు ఈ వేరియంట్ కారణమని.. 9శాతం కేసులకు ఎక్స్‌ఎఫ్‌సీ వేరియంట్ కారహన్నారు. ఒమిక్రాన్ అసలు వేరియంట్ ప్రస్తుతం కనుమరుగైందని.. ప్రస్తుతం సబ్ వేరియంట్స్ మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. ఈ వేరియంట్లు అంత ప్రమాదకరమేమీ కాదని.. కాలక్రమేణా ప్రజల రోగనిరోధక శక్తి బలహీనపడడం వల్ల వైరస్ మరింత సులభంగా వ్యాపిస్తుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ ప్రారంభంలో ఎల్‌పీ.8.1 వేరియంట్ కారణంగా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఇన్ఫెక్షన్ కేసులు పెరిగాయి. యూకే, ఆస్ట్రేలియా సహా అనేక ప్రాంతాల్లో ఈ వేరియంట్ కారణంగా ఇన్ఫెక్షన్ పెరిగినట్లు పలు నివేదికలు పేర్కొన్నారు. జనవరిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎల్‌పీ.8.1 వేరియంట్‌ని.. అండర్ మానిటరింగ్ వేరియంట్‌గా పేర్కొంది.

# దేశ రాజధాని ఢిల్లీలో రెండు వేర్వేరు అగ్ని ప్రమాదాలు




**ఢిల్లీ మే 18 ప్రజా స్వేచ్ఛ**
దేశ రాజధాని ఢిల్లీ లోని ఓ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నాలుగు, ఐదో అంతస్తుల్లో మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు.ఓల్డ్ రాజేందర్‌నగర్‌లోని బడాబజార్ రోడ్డులోని ఓ కోచింగ్ సెంటర్‌లో ఉదయం 11.08 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తమకు సమాచారం అందిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. వెంటనే తమ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారని అన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఇదిలావుంటే వెస్ట్ ఢిల్లీలోని పశ్చిమ్ విహార్‌లో కూడా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ హోటల్‌లో ఆదివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. మూడో అంతస్తులోని ఓ గదిలోంచి మంటలు చెలరేగడంతో ఐదు అగ్నిమాపక శకటాలతో మంటలు అదుపు చేశారు. పశ్చిమ్ విహార్ మెట్రో స్టేషన్ సమీపంలోని హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. మంటలు చెలరేగడానికి గల కారణాలు ఇంకా తెలియలేదు.

# గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ బాంబు దాడులు..


## -125 మంది మృతి



**గాజా మే 18 ప్రజా స్వేచ్ఛ**
గాజా పై ఇజ్రాయెల్ బాంబు దాడులు కొనసాగుతున్నాయి. హమాస్ తో ఉద్రిక్తతల నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులను కొనసాగిస్తోంది. శనివారం అర్థరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై టెల్ అవీవ్ వైమానిక దాడులు జరపడంతో ఖాన్ యూనిస్‌లో 20 మంది, ఉత్తర గాజాలో 36 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 10 మంది సహా మొత్తం 125 మంది మరణించారని అక్కడి అధికారులు ప్రకటించారు.మొత్తం మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9 మంది ఉన్నారని, వారిలో ఏడుగురు చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన జరిగినప్పటి నుంచి 3 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాత పడినట్లు అక్కడి విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇదిలావుంటే ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు తెలిపారు. తమ బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు నిరాకరించిందని అన్నారు. గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# పరేషన్ సింధూర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు.. అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరెస్ట్..

**ఢిల్లీ మే 18 ప్రజా స్వేచ్ఛ**



భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను హర్యానాలోని సోనీపట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలీఖాన్‌ను ఢిల్లీలో అరెస్టు చేసినట్లు సోనీపట్ ఏసీపీ రాయ్ అజీత్ సింగ్ తెలిపారు. యూనివర్సిటీలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా అలీఖాన్ వ్యవహరిస్తున్నారు. అయితే, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మీడియా బ్రీఫింగ్‌లో పాల్గొన్న కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లను ప్రొఫెసర్ తప్పుపట్టారు. సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్ ఇద్దరూ జరిగింది జరిగినట్టుగా మీడియాకు చెప్పలేదని.. దేశ ప్రజలు కోరుకున్నది చెప్పారన్నారు. ప్రభుత్వం తరఫున మాట్లాడుతున్న వారు క్షేత్ర స్థాయిలో జరిగిన నిజాలను మాత్రమే చెప్పాలని.. లేకపోతే అది వంచనే అంటూ కామెంట్ చేశారు.అయితే, ఈ వ్యాఖ్యలను తప్పుపడుతూ మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. అదే రోజున తమ ఎదుట హాజరు కావాలని మే 12న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేణు భాటియా నోటీసులు జారీ చేశారు. అయితే, తన వ్యాఖ్యలకు రాష్ట్ర మహిళా కమిషన్ వక్రభాష్యం చెప్పిందని ప్రొఫెసర్ ఆరోపించారు. మహిళా కమిషన్ నా వ్యాఖ్యలను తప్పుడు తప్పుడు ఉద్దేశంతో చదివిందని.. తప్పుగా అర్థం చేసుకొని ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందన్నారు. తన మాటల్లోని అర్థాన్ని మార్చేందుకు ప్రయత్నించిందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. అయితే, ఈ వ్యవహారంలో జాతేది గ్రామ సర్పంచ్ వాంగ్మూలాన్ని సైతం పోలీసులు నమోదు చేసి తాజాగా అరెస్టు చేశారు. అయితే, ఈ వ్యవహారంపై అశోకా యూనివర్సిటీ స్పందించింది. ప్రొఫెసర్ వ్యాఖ్యలు వ్యక్తిగతమని.. వాటితో యూనివర్సిటీకి సంబంధం లేదని తెలిపింది. భారత సైన్యాన్ని చూసి యూనివర్సిటీతో పాటు అందరూ గర్విస్తున్నారని పేర్కొంది. జాతీయ భద్రత కోసం సైన్యం ఎలాంటి ఆపరేషన్లు చేపట్టినా అండగా ఉంటామని స్పష్టం చేసింది.

# ప్రతిపక్షాలు ఏకం కావాలి..


## గవర్నర్ అధికారాలపై కేంద్రం చర్యలను వ్యతిరేకించాలి: ఎంకే స్టాలిన్



**చెన్నై మే 18 ప్రజా స్వేచ్ఛ**
ప్రతిపక్ష పార్టీలు ఏకం కావాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. గవర్నర్ అధికారాలపై కేంద్రం చర్యలను వ్యతిరేకించాలని ఆయన కోరారు. బీజేపీయేతర రాష్ట్రాల సీఎంలకు మే 17న లేఖలు రాశారు. బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతి, గవర్నర్‌కు సుప్రీంకోర్టు గడువు విధించడాన్ని ఎంకే స్టాలిన్ గుర్తుచేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మే 13న రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించడాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కోర్టు నిర్ణయాన్ని లెక్కచేయకుండా గవర్నర్ అధికారాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా కోర్టును ఆశ్రయించడం వారి దుష్ట ఉద్దేశాన్ని సూచిస్తున్నదని ఆరోపించారు.కాగా, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలను వ్యతిరేకించాలని బీజేపీయేర రాష్ట్రాల ప్రభుత్వాలను డీఎంకే అధ్యక్షుడైన ఎంకే స్టాలిన్ కోరారు. ‘మన సుప్రీంకోర్టు తన చారిత్రాత్మక తీర్పులో (తమిళనాడు రాష్ట్రం తమిళనాడు గవర్నర్) సమర్థించిన విధంగా, రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని పరిరక్షించడానికి, సంరక్షించడానికి మనం కోర్టు ముందు సమన్వయంతో కూడిన చట్టపరమైన వ్యూహాన్ని రూపొందించాలి. ఐక్య ఫ్రంట్‌ను ప్రదర్శించాలి. ఈ కీలకమైన విషయంలో మీ తక్షణ, వ్యక్తిగత జోక్యం కోసం నేను ఎదురు చూస్తున్నా’ అని ఆ లేఖలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌తో పాటు, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార?ండ్, పంజాబ్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రులకు ఎంకే స్టాలిన్ లేఖలు రాశారు.

# కశ్మీర్‌లో గులాంనబీ పార్టీకి ఎదురుదెబ్బ.. మాజీ ఎమ్మెల్యే రాజీనామా

**జమ్మూకశ్మీర్ మే 18 ప్రజా స్వేచ్ఛ**



జమ్మూకశ్మీర్ లో సీనియర్ పొలిటీషియన్, కేంద్ర మాజీ మంత్రి గులాంనబీ ఆజాద్ స్థాపించిన పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ అమీన్ భట్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.అమీన్ భట్ 2014లో జమ్మూకశ్మీర్‌లోని దేవ్‌సర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత కేంద్రంలోని మోదీ సర్కారు జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి కూడా అయిన గులాంనబీ ఆజాద్ ఆర్టికల్ 370 రద్దును తీవ్రంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చి డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ పేరుతో సొంత పార్టీని స్థాపించారు. ఆజాద్‌కు మద్దతుగా అప్పుడు పలువురు నాయకులు లో చేరారు. అలా చేరినవారిలో అమీన్ భట్ కూడా ఒకరు. అయితే ఇవాళ ఆయన ఆజాద్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఇన్నాళ్లు పార్టీలో తనకు అవకాశం ఇచ్చిన గులాంనబీ ఆజాద్‌కు అమీన్ భట్ కృతజ్ఞతలు తెలిపారు. ఆజాద్ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన లారీ..

## నలుగురు మృతి

**పూర్ మే 18 ప్రజా స్వేచ్ఛ**
రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేస్తున్న వారి మీదకు లారీ దూసుకెళ్లింది. ఈ సంఘటనలో నలుగురు మరణించారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజస్థాన్‌లోని దుంగార్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో పెళ్లి వేడుకకు హాజరై తిరుగు ప్రయాణమైన కుటుంబం ప్రయాణించిన వ్యాన్,




పిండవాల్ హిలావాడి బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ వ్యాన్‌లో ఉన్న నలుగురు స్వల్పంగా గాయపడ్డారు.కాగా, పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న మరికొందరు ఈ ప్రమాదాన్ని చూశారు. బైకులపై ఉన్న వారు అక్కడ ఆగారు. వ్యానులో ఉన్న గాయపడిన వారికి సహాయం చేసేందుకు మరికొందరు ప్రయత్నించారు. ఇంతలో ఒక లారీ వేగంగా వచ్చింది. సహాయం చేస్తున్న వారి మీదకు అది దూసుకెళ్లింది. ఈ ఘటనలో మూడు బైకులు లారీ కింద చిక్కుకున్నాయి. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. మరోవైపు గాయపడిన వారిలో నలుగురు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారని పోలీస్ అధికారి తెలిపారు. మరో ఎనిమిది మందికి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# పాతబస్తీలో అగ్నిప్రమాదం

(మొదటి తరువాయి)

విషాదాన్ని నింపింది. ప్రధాని మోడీ, సీఎం రేవంత్ స్పందించారు. తీవ్ర దిగ్భ్రాంత్రిని వ్యక్తం చేశారు.గుల్జార్‌హౌస్ సమీపంలోని జీప్లస్–2 భవనంలో మొదటి అంతస్తులో నగలు, ముత్యాల వ్యాపారులు ప్రహాల్లాద్ మోదీ, పంకజ్ మోదీ,రాజేందర్ మోదీ కుటుంబసభ్యులు నివాసముంటు న్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నగల దుకాణం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు కావడం తో వ్యాపారి బంధువులు వారి వద్దకు వచ్చారు. శనివారం రాత్రి అందరూ ఇంట్లో పడుకున్నారు. అయితే కింది అంతస్తులో ఏసీ కంప్రెషర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పైఅంతస్తులకు వ్యాపించాయి. దట్టమైన పోగ వ్యాపించడం, ఒకే మెట్ల మార్గం ఉండటంతో బయటకు వచ్చే దారి లేక భవనంలో ఉన్నవారు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యారు, అపస్మారకస్థితిలోకి వెళ్లారు. ఆదివారం ఉదయం ప్రమాదం విషయం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జీహెచ్ఎంసీ, ఇతర విభాగం అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లేమార్గం లేకపోవడంతో నిచ్చెన సహాయంతో మొదటి అంతస్తులోకి వెళ్లారు. తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. వారంతా అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే వారిని అంబులెన్స్‌లో ఉస్మానియా, యశోద (మలక్‌పేట్), డీఆర్డోవో అపోలో ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో 17 మంది మతి చెందగా, పలువురు గాయాల బారిన పడ్డారు. ఉదయం దాదాపు 6గంటల సమయంలో భవనంలో ఏసీ కంప్రెషర్ పేలడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలోనే ముగ్గురు మతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో 14 మంది మతిచెందారు. మొత్తం 17 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి కుటుంబసభ్యులకు, బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడారు. అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదంలో కుట్రకోణం లేదని పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరఫున సాయం అందిస్తామని కేంద్రమంతి కిషన్‌రెడ్డి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అయితే ఘటనపై ప్రభుత్వం అధికారులను పూర్తి వివరాలు అందించాలని కోరింది. ఘటన ఎలా జరిగింది అన్న దానిపై ఆరా తీసింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరలేదన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ వివరాలను అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది.

రోబోతో మంటలు అదుపులోకి..

ఆదివారం ఉదయం ఆరుగంటలకు ప్రమాదం జరిగింది. 6.16 నిమిషాలకు అగ్నిమాపక సిబ్బందికి ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన మొగల్‌పుర ఫైర్ ఇంజిన్ సిబ్బంది 6.17కి బయలుదేరి 6.20గంటలకల్లా ప్రమాదస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. మొత్తం 11 ఫైర్ ఇంజినేర్లు, ఒక రోబోట్, 70 మంది ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. మంటలను ఆర్పడానికి మొత్తం 2 గంటల సమయం పట్టిందని ఫైర్ డీజీ నాగిరెడ్డి తెలిపారు. సంఘటన విషయం తెలియగానే నిమిషాల వ్యవధిలోనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారని తెలిపారు. వారు తీవ్రంగా శ్రమించి చిక్కుకుపోయిన వారిని రక్షించారని, మంటలను అదుపులోకి తీసుకువచ్చారని చెప్పారు. ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నియంత్రించగలిగామన్నారు. క్షతగాత్రులకు మలక్‌పేట యశోద, ఆపోలో డీఆర్డీవో ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నామని, ఫైర్ ఎగ్జిట్ లేకపోవటం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటన సమాచారం తెలిసిన వెంటన్టే ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, డీజీపీ జితేందర్, నగర మేయర్, నగర సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్, హైడ్రా కమిషనర్‌తోపాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పలువురు ప్రముఖులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అధికారులను, బాధితులను సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున పరిహారం : డిప్యూటీ సీఎం

ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్న ట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఇరుకైన మార్గంలో జీప్లస్–2 భవనానికి జీహెచ్ ఎంసీ అధికారులు ఎలా పర్మిషన్ ఇచ్చారనేదానిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారు:

ప్రహ్లాద్ (70), మున్ని (70), రాజేందర్ మోదీ (65), సుమిత్ర (60), హమేరు (7), అభిషేక్ (31), శీతల్ (35), ప్రియాన్స్ (4), ఇరాజ్ (2), ఆరుష్ (3), రిషబ్ (4), ప్రథమ్ (1.6), అనుయాన్ ( 3), వర్ష (35), పంకజ్ (36), రజిని (32), ఇద్దు (4).

ప్రధానితోపాటు పలువురు ప్రముఖుల తీవ్ర దిగ్భ్రాంతి

పాతబస్తీలో ఆదివారం జరిగిన ప్రమాదం ఘటనపై పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైఎస్సార్‌సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు,, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# గాజాపై ఆగని ఇజ్రాయిల్ విధ్వంసం..

(మొదటి తరువాయి)

ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు చిన్నారులు చనిపోయినట్టు అధికారులు పేర్కొన్నారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. తాజా దాడులపై ఇజ్రాయిల్ సైన్యం ఎటువంటి ప్రకటనా చేయలేదు. కాగా శనివారం ఒక్కరోజే 150 మంది ప్రాణాలు కోల్పోయారని, 450 మందికి గాయాలయ్యాయని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. ఆదివారం జరిపిన దాడుల్లో 135 మంది చనిపోయారని అధికారులు తెలిపారు.మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి 3 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారని వెల్లడించింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగిం పునకు హమాస్ అంగీకరించని కారణం గానే దాడులను తీవ్రం చేసినట్టు తెలిపారు. 'మా బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోంది. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించింది. ఈనేపథ్యంలోనే దాడులకు ఆదేశించాం.యుద్ధం లక్ష్యాలను సాధించ డానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

# 17 మంది ఎంపీలకు సంసద్ రత్న అవార్డులు



(మొదటి తరువాయి)

జ్యూరీ కమిటీ అవార్డు గ్రహీతలను ఎంపిక చేసింది. భర్తృహరి మహతాబ్, సుప్రియా సులే (ఎన్‌సీపీ–ఎస్‌పీ), ఎన్‌కె ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పీ), శ్రీరంగ్ అప్ప బర్నే (శివసేన)లను అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నలుగురు ఎంపీలు 16, 17వ లోక్‌సభల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారని, ప్రస్తుత పదవీ కాలంలోనూ అదే పనితీరును కొనసాగిస్తున్నారని ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, సిత్మా వాగ్ (బీజేపీ), అర్వింద్ సవంత్ (శివసేన %–% యూబీటీ), నరేష్ గణపతి మహస్కే (శివసేన), వర్షా గైక్వాడ్ (కాంగ్రెస్), మేధా కులకర్ణి (బీజేపీ), ప్రవీణ్ పటేల్ (బీజేపీ ), రవి కిషన్ (బీజేపీ), నిశీకాంత్ దూబే (బీజేపీ), విద్యుత్ బరన్ మహతో (బీజేపీ), పిపి చౌదరీ (బీజేపీ), మదన్ రాథోడ్ (బీజేపీ), సిఎన్ అన్నాదురై (డీఎంకే), దిలిప్ సైకియా (బీజేపీ) అవార్డు గ్రహీతల్లో ఉన్నారు. ఆర్థికం, వ్యవసాయంపై రెండు స్టాండింగ్ కమిటీలను కూడా అవార్డుకు ఎంపిక చేశారు. ఆర్థికంపై స్టాండింగ్ కమిటీకి భర్తృహరి మహతాబ్ నేతృత్వం వహిస్తుండగా, వ్యవసాయంపై స్టాండింగ్ కమిటీకి చరణ్‌జిత్ సింగ్ చన్నీ (కాంగ్రెస్) అధ్యక్షత వహిస్తున్నారు.

# డ్రగ్స్ నివారణకు మా మద్దతు

(మొదటి తరువాయి)

పోలీస్ శాఖ స్వాగతం పలికింది. పోలీస్ శాఖ అమలు చేస్తున్న విధి విధానాలపై ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలతో రాష్ట్రంలో 17 శాతం నేరాలు తగ్గాయనీ, వివిధ అంశాల్లో తెలంగాణా పోలీసులకు అంతర్జాతీయ అవార్డులు కూడా లభించాయని వివరించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ట్రాన్స్‌జెండర్ల సేవలను ట్రాఫిక్ విభాగంలో ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. మొత్తం ప్రపంచానికే సవాలుగా మారిన సైబర్ నేరాల నియంత్రణలో అత్యంత ఆధునిక టెక్నాలజీని వాడుతున్నామనీ, లక్షల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీటీవీలతో, రాష్ట్రంలో ఎక్కడ నేరం జరిగినా వెంటనే తగు చర్యలను చేపడుతున్నామని వివరించారు. ముఖ్యంగా సేఫ్టీ టూరిజంలో తెలంగాణ అత్యంత సురక్షితమైనదనీ, ఇందుకు రాష్ట్ర పోలీస్ చేపట్టిన పటిష్టమైన చర్యలే కారణమని వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, మహిళలు, పిల్లలపై వేధింపుల నివారణ, డ్రగ్స్ కట్టడికి చేపట్టిన చర్యలు, నేరాల నియంత్రణ, నేర నివార ణలో ఉపయోగిస్తున్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులు తదితర అంశాలపై పోటీదారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు విధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణా పండగలు, సంస్కృతీ సంప్రదాయాలను కండ్లముందించేలా శాస్త్రీయ నృత్య ప్రదర్శనను తిలకించారు. ఈ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు ఆయుధాల ప్రదర్శన, ఆక్టోపస్, గ్రే హౌండ్స్, పోలీస్ జాగిలాల ప్రదర్శనలు, పైప్ బ్యాండ్, అశ్విక దళంలను కాంటెస్టర్లు ఆసక్తిగా పరిశీలించారు. సెల్ఫీలను దిగారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను నిరంతరం పరిశీలించే అత్యాధునిక కమాండ్ కంట్రోల్ గదిలో ఏర్పాటు చేసిన ఆధినిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సర్వేలెన్స్ ఫీడ్‌లు, తక్షణమే స్పందిం చే వ్యవస్థను మిస్ వరల్డ్ పోటీ దారులు స్వయ ంగా పరిశీలించారు. జీవన ప్రమాణాలు పెంపొందిం చడం, సురక్షిత టూరిజంకు, రాష్ట్ర అభివృద్ధికి భద్రతా చర్యలు ఎంతటి కీలక పాత్ర వహిస్తాయో తెలంగాణా పోలీస్‌ను ఉదాహరణ చెప్పవచ్చని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరే రాష్ట్రంలో లేని విధంగా, ట్రాఫిక్ నియంత్రణా చర్యలకు సేవలందిస్తున్న ట్రాన్స్ జెండర్లతో కలసి మిస్‌వరల్డ్ పోటీదారులు ఫొటోలు దిగారు.

# తెలంగాణలో లిక్కర్ ధరలు పెంపు..!

(మొదటి తరువాయి)

పెరిగిన ధరలు ఈ నెల 19 నుంచి అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, చీప్ లిక్కర్ ధరల్లో ఎలాంటి మార్పులుండబోవని పేర్కొంది. పెరిగిన ధరల వల్ల రాష్ట్రానికి దాదాపు రూ.3,500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది.

గత నెలలోనే నిర్ణయం

మద్యం ధరలను పెంచాలని గత నెలలోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రిటైర్డ్ జడ్జి జైస్వాల్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ బీర్లు, లిక్కర్ ధరలను పెంచాలని గతేడాది చివర్లోనే ప్రభుత్వానికి సిఫారసు చేసింది. బీర్లు, లిక్కర్ ధరలను ఒకే సారీ పెంచితే ప్రజల్లో వ్యతిరేక త వస్తుందనే భయంతో విడతల వారీగా పెంచుకుంటూ వచ్చారు. ఈ క్రమం లో నే ప్రభుత్వం ఫిబ్రవరిలో బీర్ల ధరలను 15 శాతం పెంచింది. ఫలితంగా అన్ని రకాల బీర్లపై సగటున రూ.30 వరకు పెరిగింది. తాజాగా క్వార్టర్‌పై రూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున పెంచింది.

# లోతుగా దర్యాప్తు చేయండి

(మొదటి తరువాయి)

ఇలాంటి విషయాల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. మంటల్లో చిక్కుకున్న వారిలో 17 మంది మృతి చెందడం పట్ల సీఎం తీవ్ర విచారాన్ని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. మతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీనిచ్చారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడారని సీఎంవో ఈ సందర్భంగా తెలిపింది. తద్వారా సహాయక చర్యలను పర్యవేక్షించారని పేర్కొంది. వాటిని వేగవంతం చేయటంతోపాటు బాధితులకు మెరుగైన వైద్య సాయం అందించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లాలని సీఎం ఆదేశించారు. అక్కడున్న బాధిత కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడారని వివరించింది.

# పాక్‌లో లష్కరే అగ్రనేత హతం

(మొదటి తరువాయి)

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో దాడులకు పాల్పడ్డాడు. 2006లో నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడంలో కీలకంగా వ్యవహరించాడు సైఫుల్లా ఖలీద్. ఐదేండ్ల వ్యవధిలోనే జరిగిన ఈ దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ఖలీద్ నేపాల్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. అక్కడ వినోద్ కుమార్ పేరుతో తప్పుడు ధృవపత్రాలు సృష్టించి, స్థానిక మహిళ నగ్మా బానును వివాహం చేసుకున్నాడు. లష్కరే తోయిబా కార్యకలాపాలను నేపాల్ నుంచే ఖలీద్ సమన్వయం చేసినట్లు సమాచారం. ఇటీవల ఖలీద్ తన స్థావరాన్ని పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ బాదిన్ జిల్లాలోని మట్లీకి మార్చాడు. లష్కరే తోయిబాతో పాటు దాని ప్రధాన సంస్థ జమాద్–ఉద్–దవా కోసం ఖలీద్ పని చేస్తున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలతో పాటు నియామకాలు, నిధుల సేకరణపై సైఫుల్లా దృష్టి సారించాడు.

# పీఎస్ఎల్‌వీ సీ61 ప్రయోగం విఫలం..

(మొదటి తరువాయి)

కిలోమీటర్ల ఎత్తులో సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఇందుకోసం ఈ రాకెట్ 17 నిమిషాల 39 సెకన్ల పాటు నాలుగు దశల్లో రాకెట్ ప్రయాణించాల్సి ఉంది. మొదటి, రెండు దశల వరకు దీని ప్రయాణం సాఫీగానే సాగింది. మూడో దశలోనే సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ నిర్దేశిత మార్గంలో కాకుండా మరో మార్గంలో ప్రయాణించడం మొదలు పెట్టింది. ఇందులో లోపం ఎక్కడ తలెత్తిందన్న వివరాలను విశ్లేషణ తర్వాత వెల్లడిస్తామని ఇస్రో చైర్మెన్ తెలిపారు.

# బీర్లను, బార్లను నమ్ముకొని రాష్ట్రంలో పాలన

(మొదటి తరువాయి)



అవసరమైన సవరణలు చేస్తామనీ, బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఒకవైపు ఎక్సైజ్ ద్వారా ప్రజల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తూ, మరోవైపు ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు సరైన కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు

# సంపాదకీయం

## ట్రంప్ దౌత్య రాజకీయం

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత వ్యవహారాలలో ప్రమేయం పెట్టుకోకుండా దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారు. అయితే ట్రంప్ మహాశయుడు మోదీ అభీష్టాన్ని నెరవేరుస్తారా? నెరవేర్చరు, సందేహం లేదు. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలో ఉగ్రవాద దాడితో ప్రారంభమైన ఇండియా పాకిస్థాన్ సంఘర్షణలో అమెరికా ప్రమేయం పెట్టుకుని తీరాలని డోనాల్డ్ ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఈ ఘర్షణపై తాను మాట్లాడిన ప్రతిసారీ, ట్వీట్ చేసిన ప్రతిసారీ తానూ భాగస్తుడినని మరీ మరీ స్పష్టం చేస్తున్నారు. ట్రంప్ అత్యుత్సాహానికి మౌనమే ఇంతవరకూ మోదీ ప్రతిస్పందన. సెప్టెంబర్ 2019లో హ్యూస్టన్‌లో 'అబ్కీ బార్, ట్రంప్ సర్కార్' అని పిలుపు ఇచ్చినందుకు మోదీ ఇప్పుడు కలవరపడుతూ ఉండవచ్చని నేను అనుమానిస్తున్నాను. ఏప్రిల్ 22న, ఇతర ప్రపంచ నాయకుల వలే ట్రంప్ కూడా పహల్గాం ఘాతుకంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఘటనను తీవ్రంగా ఖండించారు. మే 7న పాకిస్థాన్‌లో ఎంపిక చేసిన లక్ష్యాలపై భారత్ మిస్సైళ్ల, డ్రోన్‌ల దాడి ప్రారంభించింది. పూర్తి స్థాయి యుద్ధానికి దిగే ఉద్దేశం తమకు లేదని ఇండియా స్పష్టం చేసింది. భారత్ పాకిస్థాన్‌ల మధ్య సాయుధ ఘర్షణ శీఘ్రగతిన ముగుస్తుందని ఆశిస్తున్నానని ట్రంప్ ట్వీట్ చేశారు. ఆ మరుసటి రోజు 'తాను ఏమైనా సహాయం చేయగలుగుతానని భావిస్తే అక్కడ ఉంటాను' అని ఆయన అన్నారు. మే 8/9 రాత్రి ఆయన వైఖరిలో ఏదో మార్పు చోటుచేసుకున్నది. చైనా ఉత్పత్తి చేసిన యుద్ధ విమానాలు, మిస్సైళు, టర్కీలో తయారైన డ్రోన్స్‌ను పాకిస్థాన్ ఉపయోగిస్తున్న విషయం తెలియడం వల్లే ఆ మార్పు సంభవించి ఉంటుందని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ ప్రయోగించిన మిస్సైళ్లు, డ్రోన్‌లు అన్నిటినీ కూల్చివేసినట్టు మన సీనియర్ సైనికాధికారులు ధ్రువీకరించారు. రెండు రోజుల అనంతరం భారత్‌కు కొంత 'నష్టం' సంభవించినట్టు అధికారికంగా అంగీకరించారు. యుద్ధంలో రెండుపక్షాలకు నష్టం వాటిల్లడం సహజమే కదా. జరిగిన నష్టానికి ఇండియా ఏమీ ఆందోళన చెందలేదు. భారత ప్రజలూ కలవరపడలేదు. మే 10న ట్రంప్ తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో చేసిన ట్వీట్‌తో కలవరం మొదలయింది. ఆ రోజు సాయంత్రం 5.25 గంటలకు ట్రంప్ తన ట్వీట్‌లో అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల గురించి ప్రస్తావిస్తూ భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే, పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించేందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇరు దేశాలను అభినందించారు. కొద్ది నిమిషాల అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి ఒక 'తటస్థ' ప్రదేశంలో చర్చలకు భారత్, పాకిస్థాన్‌లు సమావేశమవనున్నాయని ట్వీట్ చేశారు. అంతకు ముందు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ మోదీతో టెలిఫోన్‌లో జరిపిన సంభాషణల్లో ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని తెలియజేసినట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ ట్వీట్‌లు అన్నీ ఆసక్తికరంగానూ, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి. మే 10 మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)ల మధ్య చర్చలు జరిగాయని, సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని అదే రోజు సాయంత్రం 6 గంటలకు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి ధ్రువీకరించారు. మే 12న 'అణు యుద్ధ' ప్రమాదాన్ని నివారించామని ట్రంప్ పేర్కొన్నారు. 'ఆ భయంకర యుద్ధానికి పాల్పడవద్దు. మీరు సంయమనంతో వ్యవహరిస్తేనే మీతో మేము వాణిజ్యం చేస్తామ'ని ఆయన అన్నారు. 'మీరు గనుక యుద్ధాన్ని ఆపకపోతే మేము ఎటువంటి వాణిజ్యమూ చేయం' అని ఆయన పేర్కొన్నారు. (సౌదీ అరేబియా, ఖతర్ పర్యటనలలో కూడా అధ్యక్షుడు ట్రంప్ తన ప్రకటనలను పునరుద్ఘాటించారు). మే 13న 'కొత్త సాధారణ పరిస్థితి' గురించి మోదీ ప్రస్తావించారు. 'అణు బ్లాక్ మెయిల్'కు తాము భయపడమని, తలొగ్గమని స్పష్టం చేశారు. కొన్ని సహేతుకమైన ప్రశ్నలు: మూడు అంశాల సూత్రంలో 'కొత్త' విషయమేమీ లేదు. ఉగ్రవాద దాడికి దీటుగా ప్రతిస్పందించడంబీ అణు బ్లాక్‌మెయిల్‌ను సహించకపోవడంబీ రాజ్య ఉగ్రవాదం, ఉగ్రదాడుల వ్యూహ ప్రజ్ఞాధురీణుల మధ్య వ్యత్యాసాన్ని పాటించకపోవడం. ఈ సువ్యవస్థిత సిద్ధాంతాన్నే కదా మోదీ పునరుద్ఘాటించింది? (2) ఉపాధ్యక్షుడు వ్యాన్స్, విదేశాంగ కార్యదర్శి రూబియో మే 8, 9న కాల్పుల విరమణ గురించి మాట్లాడారా? అదే సమయంలో వారు పాకిస్థాన్ నేతలతో కూడా మాట్లాడారా? మాట్లాడి ఉన్నట్టయితే అది మధ్యవర్తిత్వం కిందకు వస్తుంది కదా. (3) మే 9న మోదీతో 'ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని' ఉపాధ్యక్షుడు వ్యాన్స్ పంచుకున్నారా? అణ్వస్త్రాలను ప్రయోగిస్తామన్న పాకిస్థాన్ బెదిరింపునకు సంబంధించినదేనా ఆ సమాచారం? కానట్టయితే ప్రధానమంత్రి (మే 12), రక్షణ మంత్రి (మే 15) అణు బ్లాక్‌మెయిల్ గురించి ఎందుకు ప్రస్తావించారు? (4) మే 10న మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్‌ల డీజీఎమ్ఓలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చినట్టు ట్రంప్‌కు ఎలా తెలిసింది? ఆ విషయాన్ని అదే రోజు సాయంత్రం 5.25 గంటలకు తన ట్వీట్‌లో ఆయన ఎలా ప్రకటించారు? (5) ట్రంప్ ఏప్రిల్ 2న సుంకాల సమరాన్ని ప్రారంభించిన తరువాత భారత్ మారు ప్రతిపాదనలు పంపలేదా? ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తన ఇండియా పర్యటనలో మోదీతో జరిపిన సంభాషణల్లో 'వాణిజ్య ఒప్పందం' విషయాన్ని ప్రస్తావించిందా? (6) భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం చేశామని, వాణిజ్యం అంశాన్ని ఉపయోగించుకుని కాల్పుల విరమణ పాటించేలా బలవంతం చేశామని ట్రంప్ పదే పదే చెప్పుతుండడంపట్ల అమెరికాకు ఇండియా నిరసన తెలిపిందా? పాకిస్థాన్‌కు ఐఎమ్ఎఫ్ రుణం మంజూరుకు సంబంధించిన సమావేశానికి ఇండియా ఎందుకు గైర్హాజరయింది? ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయలేదు? ఇంకా వివిధ ప్రశ్నలు ఉన్నాయి. అయితే వాటిని ప్రస్తావించేందుకు తగిన సమయం ఆసన్నమవలేదు. డోనాల్డ్ ట్రంప్ ఎవరికీ లొంగే వ్యక్తి కాదు. భారత్, పాకిస్థాన్ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?

# స్కూల్‌కు వెళ్తున్న దళిత బాలికపై సామూహిక అత్యాచారం..

**-మైనర్‌తో సహా ముగ్గురు అరెస్ట్**



**లక్నో మే 18 ప్రజా స్వేచ్ఛ**
స్కూల్‌కు వెళ్తున్న దళిత బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మైనర్ బాలుడితోపాటు మరో ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 14 ఏళ్ల దళిత బాలిక పదో తరగతి చదువుతున్నది. మే 16న శుక్రవారం ఉదయం నడుస్తూ స్కూల్‌కు వెళు తున్నది. దారిలో15 ఏళ్ల బాలుడు కారులో కనిపించాడు. స్కూల్ వద్ద దింపుతానని చెప్పి ఆ బాలికను కారులోకి ఎక్కించుకున్నాడు. కాగా, మార్గమధ్యలో మరో ఇద్దరు యువకులు ఆ కారులోకి ఎక్కారు. ముగ్గురు కలిసి ఆ బాలికను ఒక గదికి తీసుకెళ్లారు. ఆమె చేతులు కట్టేసి, అరవకుండా నోటిని మూసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. గంట తర్వాత ఆ బాలిక స్పృహలోకి రావడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. మరోవైపు బాధిత బాలిక జరిగిన దారుణం గురించి బంధువైన మహిళకు చెప్పింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మైనర్ బాలుడితోపాటు నిందితులైన 18 ఏళ్ల ప్రదీప్, సౌరభ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, నిందితులను రిమాండ్ నిమిత్తం జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనకు ముందు రోజు మైనర్ బాలుడు ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికను సంప్రదించాడని, తనను కలవాలని కోరగా ఆమె నిరాకరించినట్లు దర్యాప్తులో తెలిసిందని చెప్పారు. ఈ కేసుపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# జనసంద్రంగా కాళేశ్వరం

**-సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన భక్తులు**
**-హెలికాప్టర్ ద్వారా కలెక్టర్ ఏరియల్ సర్వే**



**భూపాలపల్లిపుష్కరాల మే 18 ప్రజా స్వేచ్ఛ**
జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రం జనసంద్రంగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు పోటెత్తారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో ఎదురైన ఇబ్బందులు పునరావతం కాకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాహనాల రాకపోకలు సాగాయి. కాళేశ్వరంలో ప్రజల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. నది తీరం, వాహనాలు రాకపోకలతో పాటు ఏర్పాట్లు తదితర సేవలను పర్యవేక్షించారు. ఉదయం నుండి కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. సరస్వతి ఘాట్, త్రివేణి సంగమం, ఆరోగ్య శిబిరం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం, పుష్కర విధులు నిర్వహించు సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనశాల తదితర ప్రాంతాలల్లో పర్యటించారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నదని, సోమవారం వరకు అదనంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తులు వెళ్లేందుకు వీలుగా అదనంగా తాత్కాలిక రహదారి వేయాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు అదనంగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని డిపిఓను ఆదేశించారు. సంగమ ప్రాంతంలో అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, డిపిఓకు సూచించారు. భక్తులకు దర్శనం త్వరగా అయ్యేలా చూడాలని దేవస్థానం సిబ్బందిని కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. భద్రత, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**ప్రజలకు అనువుగా జారు రైడ్ : జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ**

భక్తులు కాళేశ్వరం అందాలను వీక్షించేందుకు అనువుగా జారు రైడ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం ఉదయం హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం సరస్వతి ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే సందర్శకులకు హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు ప్రక్కల అడవులు తదితర అందాలను వీక్షించడానికి జారు రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కరీంనగర్ సిపి గౌస్ అలం, కరీంనగర్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశారు ఉన్నారు.

# ప్రపంచ తొలి 'ఏఐ డాక్టర్ '

**- సౌదీ అరేబియాలో ప్రారంభం**
**- చైనాకు చెందిన వైద్య పరిజ్ఞాన సంస్థ సైన్సీ ఏఐతో భాగస్వామ్యం**
**- అల్‌మూసా హెల్త్ గ్రూప్ ప్రయోగాత్మకంగా అందుబాటులోకి**




**జెద్దా ప్రజా స్వేచ్ఛ**
కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రోగులను పరీక్షించే క్లినిక్.. ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాలో ప్రారంభమైంది. చైనాకు చెందిన వైద్య పరిజ్ఞాన సంస్థ సైన్సీ ఏఐతో భాగస్వామ్యం ద్వారా అల్‌మూసా హెల్త్ గ్రూప్ ప్రయోగాత్మకంగా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సౌదీలోని అల్ అహ్సా ప్రావిన్స్‌లో ఇది ఏర్పాటైంది. రోగులతో తొలుత సంభాషించి, వ్యాధి నిర్ధారణ, చికిత్స చేసే బాధ్యత నుంచి వైద్యులను తప్పించడం దీని ఉద్దేశం. ”ఈ ఏఐ క్లినిక్ వినూత్న వైద్య సేవా వ్యవస్థ. ఇందులో ఏఐ వ్యవస్థ స్వతంత్రంగా.. వివరాల సేకరణ నుంచి మందులు సూచించడం వరకూ పలు సేవలు అందిస్తుంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతుంది. వారు వ్యాధి నిర్ధారణ, చికిత్స ఫలితాలను సమీక్షిస్తారు” అని సైన్సీ సంస్థ పేర్కొంది.

పనిచేసేదిలా! ఏఐ వైద్య వ్యవస్థకు 'డాక్టర్ హువా' అని పేరుపెట్టారు. క్లినిక్‌కు వచ్చాక.. ఒక ట్యాబ్ సాయంతో ఏఐకి తమ వ్యాధి లక్షణాలను రోగి వివరించాలి. వెంటనే అది మరిన్ని ప్రశ్నలు సంధిస్తుంది. మానవ సహాయకుల సాయంతో సేకరించిన డేటాను, చిత్రాలను విశ్లేషిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే డాక్టర్ హువా ఒక చికిత్స ప్రణాళికను అందిస్తుంది. దీన్ని వైద్యుడు కూలంకషంగా సమీక్షించి, సంతకం చేస్తారు. అయితే ఏఐ పరిశీలించలేని అత్యవసర కేసుల కోసం వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం ఈ ఏఐ డాక్టర్ ద్వారా ఉబ్బసం సహా దాదాపు 30 రకాల శ్వాసకోశ రుగ్మతలకు సంబంధించిన కన్సల్టేషన్ సేవలను అందిస్తున్నారు.

# అసలైన కారణాలను కనుక్కోండి

**- కుటుంబ సభ్యులకు సానుభూతి**
**- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా**





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్‌ప్రజా స్వేచ్ఛ**
హైదరాబాద్‌లోని గుల్జార్ హౌజ్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ ప్రమాదానికి గల అసలైన కారణాలను తెలుసుకునేందుకు వీలుగా లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. ఇలాంటి విషయాల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. మంటల్లో చిక్కుకున్న వారిలో 17 మంది మృతి చెందడం పట్ల సీఎం తీవ్ర విచారాన్ని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. మతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీనిచ్చారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడారని సీఎంవో ఈ సందర్భంగా తెలిపింది. తద్వారా సహాయక చర్యలను పర్యవేక్షించారని పేర్కొంది. వాటిని వేగవంతం చేయటంతోపాటు బాధితులకు మెరుగైన వైద్య సాయం అందించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లాలని సీఎం ఆదేశించారు



## చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో
# అగ్నిప్రమాదం

ఊపిరాడక 17 మంది మృతి

### చార్మినార్ సమీపంలో అత్యంత హృదయ విదారక ఘటన

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి

- ఏసీ కంప్రెషర్ పేలి కిందంతస్తులో మంటలు
- తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లిన సహాయక సిబ్బంది
- రోబోతో మంటలు అదుపులోకి..
- కుట్రకోణం లేదన్న పోలీసులు

ధూల్‌పేట్‌ప్రజా స్వేచ్ఛ

హైదరాబాద్‌లోని చార్మినార్‌కు అతి సమీపంలో గుల్జార్‌హౌస్ వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకున్న అత్యంత హృదయ విదారక ఘటనలో 17 మంది అగ్నికి ఆహుతయ్యారు. 8 మంది చిన్నారులు, 5గురు మహిళలు, 4 గురు పురుషులు మృతిచెందారు. చనిపోయినవారంతా ఒకే కుటుంబానికి చెందినవారు, బంధువులు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రధాని మోడీ, సీఎం రేవంత్ స్పందించారు. తీవ్ర దిగ్భాంత్రిని వ్యక్తం చేశారు.గుల్జార్‌హౌస్ సమీపంలోని జీప్లస్-2 భవనంలో మొదటి అంతస్తులో నగలు, ముత్యాల వ్యాపారులు ప్రహ్లాద్ మోదీ, పంకజ్ మోదీ,రాజేందర్ మోదీ కుటుంబసభ్యులు నివాసముంటు న్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నగల దుకాణం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు కావడం తో వ్యాపారి బంధువులు వారి వద్దకు వచ్చారు. శనివారం రాత్రి అందరూ ఇంట్లో పడుకున్నారు. అయితే కింది అంతస్తులో ఏసీ కంప్రెషర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పైఅంతస్తులకు వ్యాపించాయి. దట్టమైన పొగ వ్యాపించడం, ఒకే మెట్ల మార్గం ఉండటంతో బయటకు వచ్చే దారి లేక భవనంలో ఉన్నవారు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యారు, అపస్మారకస్థితిలోకి వెళ్లారు. ఆదివారం ఉదయం ప్రమాదం విషయం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జీహెచ్‌ఎంసీ, ఇతర విభాగం అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లేమార్గం లేకపోవడంతో నిచ్చెన సహాయంతో మొదటి అంతస్తులోకి వెళ్లారు. తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. వారంతా అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే వారిని అంబులెన్స్‌లో ఉస్మానియా, యశోద (మలక్‌పేట్), డీఆర్డోవో అపోలో ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో 17 మంది మతి చెందగా, పలువురు గాయాల బారిన పడ్డారు. ఉదయం దాదాపు 6గంటల సమయంలో భవనంలో ఏసీ కంప్రెషర్ పేలడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలోనే ముగ్గురు మతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో 14 మంది మతిచెందారు. మొత్తం 17 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి కుటుంబసభ్యులకు, బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడారు. అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదంలో కుట్రకోణం లేదని పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరపున సాయం అందిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




## ఢిల్లీలో మరో గౌరవ డాక్టరేట్ అందుకున్న కవి,పాత్రికేయుడు డాక్టర్ మోటూరి నారాయణరావు

మహేశ్వరం, మే 18 ప్రజా స్వేచ్ఛ

దేశ రాజధాని న్యూఢిల్లీ కళామంచ్ ఆడిటోరియంలో పాత్రికేయుడు , కవి,రచయిత డాక్టర్ మోటూరి నారాయణరావు గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దోమన చిన్నారావు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జాతీయ అవార్డులు 2025, గౌరవ డాక్టరేట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా సాహితీ, సామాజిక సేవలు అందిస్తున్న మోటూరి నారాయణ రావు కు గౌరవ డాక్టరేట్ ను సెంట్రల్ జీఎస్టి చీఫ్ కమిషనర్ ఎస్ కే రహ్మాన్ (ఐ.ఆర్.ఎస్) ,
నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్, ట్యాగ్ లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి లక్ష్మీనారాయణ, విశాఖపట్నం మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ న్యూఢిల్లీ డి నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు న్యాయవాది , డాక్టర్ వి. శ్రీనివాసరావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ దోమన చిన్నారావు చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ స్వీకారోత్సవం జరిగింది. తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శిగా, శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షుడిగా, సర్వజన సాహితీ సామాజిక సేవా సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సాహిత్య సేవలందించటంతో పాటు ఎస్ వీ ఫౌండేషన్ చైర్మన్ గా డాక్టర్ మోటూరి నారాయణరావు సమాజంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా పటాన్ చెరు నియోజకవర్గంలో దాదాపు ఎనిమిది రాష్ట్రాల నుంచి సహస్ర కవులను ఒకచోట




సమావేశపరచి తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించటంతో పాటు వందమంది కవులతో వంద ఆంశాలతో వెలువరించిన శత కవన కృతులు, మరో 58 సంకలనాలను ప్రచురించిన డాక్టర్ మోటూరి నారాయణరావు సాహిత్య సేవలకు, అదే విధంగా సామాజిక సేవలకు గాను సన్ రైజ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ ను అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ దోమన చిన్నారావు మాట్లాడుతూ.. సామాజిక, సాహిత్య సేవలను జాతీయంగా పేద ప్రజలకు అందిస్తున్న సాహితీ వేత్తలు, సామాజిక వేత్తలను గుర్తించి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనే ఉద్దేశంతోనూ, వారందరూ ప్రపంచ ఖ్యాతి పొందాలని , ప్రతీఒక్కరూ గుర్తించాలని అలాంటి మంచి ఉద్దేశం ఉన్నవారికి సమాజంలో మంచి గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుండి వచ్చిన వారికి ప్రధానం చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీ నుండి 30 మందికి గౌరవ డాక్టరేట్లు 20 మందికి జాతీయ అవార్డులను ముఖ్య అతిథులు చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ పొందిన డాక్టర్ మోటూరి నారాయణరావు మాట్లాడుతూ.. సమాజ హితమే సాహిత్య అభిమతం కావాలనే ఉద్దేశంతో తెలుగు వెలుగు సాహిత్య వేదిక ద్వారా జాతీయ స్థాయిలో ఎందరో ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న డాక్టర్ మోటూరి నారాయణరావు కు మరో డాక్టరేట్ వరించటంపై పలువురు నాయకులు, సాహితీ వేత్తలు, పాత్రికేయ మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి



ప్రజా స్వేచ్ఛ మే 18 అడ్డాకుల ప్రతినిధి

అడ్డాకుల మండల కేంద్రంలో, వివాహ వేడుక శుభకార్యము లోపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన అడ్డాకుల మండల మాజీ జెడ్పిటీసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి.అడ్డాకుల మండల కేంద్రంలో ని,శ్రీ శివాంజనేయ స్వామి దేవస్థానం లో జరిగిన వివాహం.అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన జగదీశ్వర చారి సోదరి నిత్య (అఖిల) వినయ్ కుమార్ చారి ల,వివాహ మహొత్సవ వేడుక శుభకార్యానికి హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి, ఆశీర్వదించి నూతన జంటకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుక కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ ఖాజా గోరి,బొడ్డు రమేష్,దేవన్న బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం.



మహేశ్వరం, మే 18 ప్రజా స్వేచ్ఛ
మహేశ్వరం మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన యాదగిరి కృష్ణ కుమార్తె పెళ్లికి యశ్వా ఫౌండేషన్ చైర్మన్ పల్నాటి నరేష్ నేత పదివేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి పేదల కోసం యశ్వ ఫౌండేషన్ అన్ని రంగాలలో ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. మానవసేవయే మాధవసేవ గా భావించి మనం సంపాదించిన దాంట్లో ఎంతో కొంత మేరకు ప్రతి ఒక్కరూ పేదలకు సహాయం చేయడంలో ముందుకు రావాలని ఆయన కోరారు.

## మైసమ్మ మృతి పట్ల నేతల సంతాపం



ఆమనగల్లు, మే 18 ప్రజా స్వేచ్ఛ
ఆమనగల్లు పట్టణ మాజీ వార్డు సభ్యులు వసుపుల సాయిలు మాతృమూర్తి మైసమ్మ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతదేహాన్ని మాజీ ఎంపీటీసీ గుర్రం కేశవులు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వసుపుల జంగయ్య, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంగ్లీ రాములు, పలువురు నాయకులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మైసమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఖాదర్ ఖాద్రి, చంద్రయ్య, తదితరులు ఉన్నారు.


## నూతన వధూవరులను ఆశీర్వదించిన నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి



ప్రజా స్వేచ్ఛ 18 అడ్డాకుల ప్రతినిధి
అడ్డాకుల మండల కేంద్రంలో, వివాహ వేడుక శుభకార్యము లోపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన అడ్డాకుల మండల మాజీ జెడ్పిటీసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి.అడ్డాకుల మండల కేంద్రంలో ని,శ్రీ శివాంజనేయ స్వామి దేవస్థానం లో జరిగిన వివాహం.అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన జగదీశ్వర చారి సోదరి నిత్య (అఖిల) వినయ్ కుమార్ చారి ల,వివాహ మహోత్సవ వేడుక శుభకార్యానికి హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి, ఆశీర్వదించి నూతన జంటకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుక కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ ఖాజా గోరి,బొడ్డు రమేష్,దేవన్న బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులలో స్వయంభు శివాలయంలో దొంగతనం

### - దర్యాప్తు చేపట్టిన పోలీసులు



మాడుగుల, మే 18 ప్రజా స్వేచ్ఛ
మాడుగుల మండలంలోని పెద్ద మాడుగుల గ్రామ శివారులో వెలసిన స్వయంభు శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పంజా విసిరారు. గర్భగుడి తాళం, హుండీలు పగలగొట్టి అందులోని నగదును అపహరించడం ఆలయ భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనను గుర్తించిన మాడుగుల పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి తక్షణమే దర్యాప్తును ప్రారంభించారు.ఆలయ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచి, ఘటనకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు.

# బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్' తో మహిళల కన్నా పురుషులకే అధిక మరణాలు

-పురుషుల్లో మరణాల రేటు 11.2%, మహిళల్లో ఇది 5.5%గా నమోదు
-టకోత్సుబో కార్డియోమయోపతీ లక్షణాలు గుండెపోటును పోలి
-తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడి ఈ వ్యాధికి ప్రధాన కారణం



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
సాధారణంగా "బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్"గా పిలిచే టకోత్సుబో కార్డియోమయోపతీ విషయంలో ఓ కీలకమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, మరణాల రేటు మాత్రం పురుషుల్లోనే రెండు రెట్లకు పైగా అధికంగా ఉన్నట్లు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిస్థితి వైద్య నిపుణులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### అధ్యయనంలో వెల్లడైన వాస్తవాలు

2016 నుంచి 2020 మధ్య కాలంలో అమెరికాలోని వివిధ ఆసుపత్రుల్లో టకోత్సుబో కార్డియోమయోపతీతో బాధపడుతూ చికిత్స పొందిన దాదాపు 2 లక్షల మంది రోగుల డేటాను పరిశోధకులు విశ్లేషించారు. ఈ విశ్లేషణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి.

మొత్తం కేసుల్లో 83 శాతం మహిళలే ఉన్నప్పటికీ, వ్యాధి తీవ్రత మరణాల రూపంలో పురుషుల్లో ఎక్కువగా కనిపించింది. పురుషుల్లో మరణాల రేటు 11.2 శాతంగా ఉండగా, మహిళల్లో ఇది 5.5 శాతంగా మాత్రమే నమోదైంది. మొత్తం మీద ఈ వ్యాధి కారణంగా మరణాల రేటు 6.5 శాతంగా ఉందని, ఐదేళ్ల అధ్యయన కాలంలో ఇందులో పెద్దగా మార్పు లేకపోవడం ఆందోళనకరమని నిపుణులు పేర్కొంటున్నారు.

ఏమిటీ టకోత్సుబో కార్డియోమయోపతీ?
టకోత్సుబో కార్డియోమయోపతీ అనేది ఓ తాత్కాలిక గుండె జబ్బు. తీవ్రమైన మానసిక లేదా శారీరక ఒత్తిడికి గురైనప్పుడు ఇది సంభవిస్తుంది. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు గుండెపోటును పోలి ఉంటాయి. చాలా సందర్భాల్లో ఇది నయం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కొన్నిసార్లు ఇది కంజెషన్ వల్ల కలిగే గుండె వైఫల్యం, కార్డియోజెనిక్ షాక్, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చు.

### నిపుణుల ఆందోళన

ఈ అధ్యయన రచయిత, అరిజోనా విశ్వవిద్యాలయం సార్వర్ హార్ట్ సెంటర్‌లో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ మరియు క్లినికల్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ అయిన డాక్టర్ ఎం. రెజా మొవహెద్ మాట్లాడుతూ, "టకోత్సుబో కార్డియోమయోపతీ వల్ల మరణాల రేటు ఐదేళ్ల అధ్యయన కాలంలో గణనీయమైన మార్పులు లేకుండా అధికంగా ఉండటం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. ఆసుపత్రిలో చేరిన వారిలో తీవ్ర సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయి" అని తెలిపారు. "ఇలా మరణాల రేటు ఎక్కువగా కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితికి మెరుగైన చికిత్స, కొత్త వైద్య విధానాలను కనుగొనడానికి మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని ఇది సూచిస్తోంది" అని ఆయన వివరించారు.

### ఇతర ముఖ్యాంశాలు

ఈ అధ్యయనం ప్రకారం, టకోత్సుబో కార్డియోమయోపతీ బాధితుల్లో కంజెషన్ వల్ల కలిగే గుండె వైఫల్యం (35.9%), ఏట్రియల్ ఫిబ్రిలేషన్ (20.7%), కార్డియోజెనిక్ షాక్ (6.6%), పక్షవాతం (5.3%), గుండె ఆగిపోవడం (3.4%) వంటి ప్రధాన సమస్యలు కనిపించాయి. 61 ఏళ్లు పైబడిన వారిలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, 31-45 ఏళ్ల వయసు వారితో పోలిస్తే 46-60 ఏళ్ల మధ్య వయస్కులలో ఈ వ్యాధి 2.6 నుంచి 3.25 రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది.
శ్వేతజాతీయులలో ఈ వ్యాధి రేటు అత్యధికంగా (0.16%) ఉండగా, స్థానిక అమెరికన్లు (0.13%), నల్లజాతీయులలో (0.07%) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు. బాధితుల మధ్యస్థ గృహ ఆదాయం, ఆసుపత్రి పరిమాణం, ఆరోగ్య బీమా స్థితి వంటి సామాజిక ఆర్థిక అంశాలలో కూడా గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు విశ్లేషణలో తేలింది. పురుషులలో మరణాల రేటు అధికంగా ఉండటానికి ఒత్తిడిని ఎదుర్కొనే విధానంలో తేడాలు, సామాజిక మద్దతు తక్కువగా ఉండటం వంటివి కారణాలు కావచ్చని నిపుణులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ లింగ వ్యత్యాసాలను పరిష్కరించడానికి, వ్యాధిపై అవగాహన పెంచడానికి మరియు ప్రత్యేక చికిత్సా వ్యూహాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం నొక్కి చెబుతోంది.

# మాలలు చైతన్యం కావాలి.

-కాంగ్రెస్ చేసిన వర్గీకరణ వల్ల మాలలకు తీరని నష్టం.
-మాల శాసనసభ్యులు ప్రభుత్వాన్ని నిలదీయండి.
-మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలన్న.
-మాల సంఘాల జేఏసీ నాయకుడు రావుల అంజయ్య.



మహేశ్వరం,మే 18 ప్రజా స్వేచ్ఛ
మాలలు రాజకీయాలకతీతంగా చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ బాలన్న, మాల సంఘాల జేఏసీ నాయకుడు రావుల అంజయ్య అన్నారు. ఆదివారం హైదరాబాదులోని బేర బాలకిషన్, బాలన్న నివాసంలో మాల సంఘాల ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజులలో మాలలకు ఉనికి లేకుండా చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణను చేపట్టిందని వారు ధ్వజమెత్తారు. గ్రామ గ్రామాన మాలలను చైతన్యం చేసే విధంగా ఒక కార్యాచరణను తీసుకోవడం జరుగుతుందని వారు ప్రకటించారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని వారు మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, టెంపరేచర్ డేటా, క్రిమిలేయర్ కాకుండా అడ్డగోలుగా లెక్కలను చూపి ఎస్సీ వర్గీకరణ ను చేపట్టడం జరిగిందని వారు ఆందోళన వ్యక్తపరిచారు. ఇతర రాష్ట్రాలలో ఎక్కడ లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రం లోనే ఎస్సీ వర్గీకరణను చేపట్టడంలో అంతర్యమేముందని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మంద కృష్ణ మాదిగ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తలొగ్గి కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ చేపట్టడం జరిగిందని వారు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంచుకోటగా ఉన్న 50 లక్షల మంది మాలల ఆత్మగౌరవాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని వారు అగ్రహాం వ్యక్తం చేశారు. రాబోయే రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలలు తగిన గుణపాఠం చెప్పడం జరుగుతుందని వారు హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న మాల శాసనసభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చెరుకు రాంచందర్, మందాల భాస్కర్, ప్రముఖ అంబేద్కర్ వాది, గాయకుడు భీమసేన, అన్న పూసల వెంకటేశం, చేపూరి నరసింహ, రిటైర్డ్ తాసిల్దార్ గంగాధర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కాటి కాపరివృత్తుల సంఘం అధ్యక్షుడు తునికి పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతి మల్హోత్రాతో కలిసి పాక్ వెళ్లిన ఒడిశా యూట్యూబర్..

భువనేశ్వర్ మే 18 ప్రజా స్వేచ్ఛ
పాకిస్థాన్‌కు రహస్య సమాచారాన్ని అందిస్తున్నట్లు ఆరోపణలతో అరెస్టైన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు, ఒడిశాలోని పూరీకి చెందిన యూట్యూబర్ మహిళతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. జ్యోతితో కలిసి ఆమె కూడా పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాకు వెళ్లినట్లు దర్యాప్తులో తెలిసింది. దీంతో ఒడిశా పోలీసులు, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు ఆ మహిళ గురించి దర్యాప్తు చేస్తున్నారు. జ్యోతి మల్హోత్రాతోపాటు పాక్‌కు రహస్య సమాచారాన్ని



చేరవేతలో ఆమెకు ఏమైనా సంబంధం ఉన్నదా అన్నది ప్రశ్నిస్తున్నారు. అయితే ఒడిశా యూట్యూబర్ మహిళ వివరాలను పోలీసులు వెల్లడించలేదు.కాగా, జ్యోతి తనకు కేవలం స్నేహితురాలని ఆ మహిళ తెలిపింది. యూట్యూబ్ ద్వారానే తమ మధ్య పరిచయం ఏర్పడినట్లు చెప్పింది. పాకిస్థాన్ కోసం జ్యోతి గూఢచర్యం చేస్తున్నదన్న సంగతి తనకు తెలియదని అన్నది. ఈ విషయం తెలిసి తాను షాక్ అయ్యానని చెప్పింది. తనపై ఎలాంటి దర్యాప్తు చేసినా పూర్తిగా సహకరిస్తానని ఆమె తెలిపింది. మరోవైపు తమ కుమార్తె ఇంట్లోనే ఉన్నదని ఆ మహిళ తండ్రి మీడియాకు తెలిపారు. దర్యాప్తు సంస్థలతో తమ కుటుంబం సహకరిస్తున్నదని వెల్లడించారు.

# బిజినెస్

# పసిడి ప్రియులకు ఊరట..
# నిలకడగా బంగారం ధరలు..

ప్రపంచంలో బంగారానికి ఉన్న క్రేజ్ వేరే దేనికీ లేదని అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. బంగారాన్ని మించి ఖరీదైన లోహాలు ఉన్నా.. వేల ఏళ్లనుంచి తిరుగులేని ఆభరణాల లోహంగా కొనసాగుతోంది. ధరించడానికి మాత్రమే కాకుండా పెట్టుబడుల విషయంలోనూ బంగారం టాప్‌లో ఉంటోంది. అయితే, పెట్టుబడులు పెట్టే వారు బంగారం ధరలు పెరగాలని అనుకుంటారు. కొనాలనుకునే వారు తగ్గాలని అనుకుంటారు. నెల రోజుల క్రితం వరకు బంగారం కొనాలనుకునే వారికి ధరలు చుక్కలు చూపాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర లక్ష దగ్గర ట్రేడ్ అయింది. కానీ, భారత్ పాక్ యుద్ధం తర్వాత పరిస్థితి మారిపోయింది. ఇప్పుడిప్పుడు ధరలు తగ్గుతూ వస్తున్నాయి.

**హైదరాబాద్‌లో బంగారం ధరలు**



గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం నిన్న హైదరాబాద్ నగరంలో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 95130 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 87200 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 71350 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, ఈ రోజు 18,22,24 క్యారెట్ల బంగారం ధరలు పెరగలేదు.. తగ్గలేదు. నిన్నటిలాగే 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 95130 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 87200 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 71350 దగ్గర ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు**

నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 10800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,08000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాములు, కేజీ వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు. నిన్నటిలాగే ఈ రోజు కూడా 100 గ్రాముల వెండి ధర 10800 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ బంగారం ధర 1,08000 దగ్గర ట్రేడ్ అవుతోంది

## భారీగా తగ్గిన టీవీఎస్ ఐక్యూబ్ ధర..



**న్యూఢిల్లీ,**

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ కీలక నిర్ణయం తీసుకున్నది. తన ఎలక్ట్రిక్ స్కూటర్ మాడల్ ఐక్యూబ్ ధరను భారీగా తగ్గించింది. బ్యాటరీ కెపాసిటీని పెంచడంతోపాటు ధరను రూ.26 వేల వరకు దించింది. ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్ మాడళ్ల ధరలను రూ.16 వేలు తగ్గించిన సంస్థ..ఐక్యూబ్ ఎస్‌టీ మాడళ్లను రూ.26 వేలకు తగ్గించింది.దీంతో ఐక్యూబ్ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.31 లక్షలకు దిగిరాగా, గరిష్ఠ ధర రూ.1.59 లక్షలకు తగ్గింది. ఈ ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. అలాగే బ్యాటరీ కెపాసిటీని 3.4 కిలోవాట్ల నుంచి 3.5 కిలోవాట్లకు పెంచిన సంస్థ..మరో మాడల్‌ను 5.1 కిలోవాట్ల నుంచి 5.3 కిలోవాట్లకు పెంచింది. సింగిల్ చార్జింగ్‌తో ఐక్యూబ్ ఎస్ మాడల్ 145 కిలోమీటర్లు, ఐక్యూబ్ ఎస్‌టీ మాడల్ 212 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

## కొత్త సిరీస్‌లో రూ.20నోట్లు.. ప్రకటించిన ఆర్‌బీఐ..!

త్వరలో మహాత్మా గాంధీ సిరీస్ (కొత్త) రూ.20 నోట్లను విడుదల చేయనుంది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. కొత్త నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో రానున్నాయి. ఈ నోట్ల డిజైన్ మహాత్మా గాంధీ సిరీస్ (కొత్త) రూ.20 నోట్ల మాదిరిగానే ఉంటుంది. గతంలో సెంట్రల్ బ్యాంక్ జారీ చేసిన అన్ని రూ.20 నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో ఉంటాయని ఆర్‌బీఐ ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. కొత్త గవర్నర్ సంతకంతో కొత్త నోట్లను జారీ చేయడం అనేది ఆర్బీఐ అధినాయకత్వం మార్పు తర్వాత సాధారణంగా జరిగే ప్రక్రియేనని చెప్పింది. ఇది ప్రస్తుత కరెన్సీ నోట్ల వినియోగం, విలువను ప్రభావితం చేయదని స్పష్టం చేసింది.





# ఉత్కంఠ పోరులో పంజాబ్‌దే పైచేయి

ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న పంజాబ్ కింగ్స్ నాకౌట్ దశకు మరింత చేరువైంది. ఆదివారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ ను చిత్తుగా ఓడించింది. నేహల్ వధేరా(70), శశాంక్ సింగ్(59 నాటౌట్) మెరుపులతో కొండంత స్కోర్ చేసిన పంజాబ్..అనంతరం ఆల్‌రౌండ్ షోతో ప్రత్యర్థిని 209కే కట్టడి చేసింది. ధ్రువ్ జురెల్(53) ఒంటరి పోరాటం చేసినా.. కీలక వికెట్లు తీసిన హర్‌ప్రీత్ బ్రార్(3-22) రాజస్థాన్ నడ్డివిరిచాడు. దాంతో, పంజాబ్ 10 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన సంజూ సేనమరో ఓటమిని మూటగట్టుకుంది.ఐపీఎల్ 18వ సీజన్‌లో అదరగొడుతున్న పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది. ఆదివారం జరిగిన డబుల్ హెడర్ తొలి పోరులో రాజస్థాన్ రాయల్స్‌పై ఉత్కంఠ విజయంతో టేబుల్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. తొలుత నేహల్ వధేరా(70), శశాంక్ సింగ్ (నాటౌట్) దంచికొట్టగా.. హర్‌ప్రీత్ బ్రార్(3-22) రాజస్థాన్ నడ్డివిరిచాడు. పేస్ బౌలింగ్ యూనిట్ సమిష్టిగా రాణించగా..సంజూ సేన ఓటమి పాలైంది. జురెల్(53) మినహా టెయిలెండర్లు విఫలం కావడంతో, పంజాబ్ 10 పరుగుల తేడాతో గెలుపొందింది.పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 220 ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ తమ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో యశస్వీ జైస్వాల్(50 నాటౌట్).. ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాత మార్కో యాన్సెన్ ఓవర్లో వైభవ్ సూర్యవంశీ(40) తన ప్రతాపం చూపించి 6, 4, 6 బాదగా 17 రన్స్ వచ్చాయి. ఈ ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్ల విధ్వంసంతో రాజస్థాన్ స్కోర్ 3 ఓవర్లకు స్కోర్ 50 దాటింది.ఈ జోడీని విడదీసేందుకు స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్‌ను రంగంలోకి దింపిన అయ్యర్ ఫలితం సాధించాడు. వైభవ్.. పెద్ద షాట్ ఆడబోయి యాన్సెన్ చేతికి చిక్కాడు. దాంతో, 76 వద్ద రాజస్థాన్ తొలి వికెట్ పడింది. అయినా సరే యశస్వీ జోరు తగ్గించకపోవడంతో రాజస్థాన్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. కానీ, హర్‌ప్రీత్ అర్ధ శతకంతో జోరుమీదున్న యశస్విని ఔట్ చేసి పంజాగ్‌కు మరో బ్రేకిచ్చాడు.



# స్పోర్ట్స్

## తొలి శతకంతో రెచ్చిపోయిన సుదర్శన్..
### ప్లే ఆఫ్స్‌లో గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్..!



ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై అదిరే విజయంతో తొలి బెర్తును కైవసం చేసుకుంది. విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తున్న సాయి సుదర్శన్(108 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్(93 నాటౌట్) సైతం కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను చితక్కొట్టిన ఈ కుర్ర జోడీ.. జట్టును 10 వికెట్ల తేడాతో గెలిపించింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ బెర్తు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్ విక్టరీతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు సైతం నాకౌట్ పోరుకు అర్హత సాధించాయి.ఐపీఎల్‌లో అడుగు పెట్టిన తొలి సీజన్‌లోనే కప్ కొట్టిన గుజరాత్ టైటాన్స్.. మరో టైటిల్ వేటలో దూసుకెళ్లుతోంది. ఆదివారం డబుల్ హెడర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 10 వికెట్ల తేడాతో గెలుపొంది ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది గుజరాత్. ప్రత్యర్థి నిర్దేశించిన 200 ఛేదనలో ఓపెనర్లు దంచేశారు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సాయి సుదర్శన్(108 నాటౌట్) ఫోర్లతో అలరించాడు. అక్షర్ పటేల్ వేసిన తొలి ఓవర్లో సాయి బౌండరీ కొట్టగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(93 నాటౌట్) సిక్సర్ బాదాడు. అనంతరం నటరాజన్ ఓవర్లో సాయి రెచ్చిపోయి 6, 4, 4, 4 సాధించాడు. వీళ్లిద్దరూ ధనాధన్ ఆడుతుండంతో 26 బంతుల్లోనే 50 పరుగులు వచ్చాయి. దాంతో, గుజరాత్ 6 ఓవర్లలో 59 పరుగులు చేసింది.సూపర్ ఫామ్‌లో ఉన్న గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి ఆ కాసేపటికే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో బౌండరీతో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు సుదర్శన్. 30 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో యాభై మార్క్ అందుకున్నాడీ హిట్టర్. అదే ఓవర్లో శుభ్‌మన్ గిల్(28 నాటౌట్) భారీ సిక్సర్ బాదడంతో గుజరాత్ స్కోర్ 80 దాటింది. చమీర వేసిన 12వ ఓవర్లో ఫోర్‌తో గిల్ కూడా ఫిఫ్టీ సాధించాడు. అదే ఓవర్లో సాయి కూడా బౌండరీ కొట్టగా 19 పరుగులు వచ్చాయి. వికెట్ తీసే బౌలర్ కరువవడంతో ఈ జోడీ బౌండరీలతో రెచ్చిపోయింది. నటరాజన్ వేసిన 17వ ఓవర్లో శివాలెత్తిపోయిన గిల్.. వరుసగా 4, 6 బాదాడు. కుల్దీప్ ఓవర్లో స్ట్రెయిట్‌గా సిక్సర్ బాదిన సాయి ఐపీఎల్‌లో తొలి సెంచరీ సాధించాడు. విప్రజ్ బౌలింగ్‌లో సిక్సర్‌తో జట్టుకు 10 వికెట్ల విజయాన్ని అందించాడు.

# టీ20ల్లో 7వ శతకం..
# రికార్డులు తిరగరాసిన రాహుల్

భారత జట్టుకు ఆపద్బాంధవుడైన కేఎల్ రాహుల్ ఐపీఎల్‌లోనూ అదరగొడుతున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలుస్తున్న రాహుల్ ఐపీఎల్ 18వ సీజన్‌లో శతకంతో గర్జించాడు. ఆదివారం గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఊచకోత కోస్తూ 60 బంతుల్లోనే మెరుపు సెంచరీ సాధించాడీ హిట్టర్. తద్వారా ఐపీఎల్‌లో ఐదోసారి మూడంకెల స్కోర్ అందుకున్న రాహుల్.. రికార్డులు తిరగరాశాడు.ఐపీఎల్‌లో మూడు జట్ల తరఫున సెంచరీ బాదిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు రాహుల్. పంజాబ్ కింగ్స్ , లక్నో సూపర్ జెయింట్స్ తరఫున వంద కొట్టిన అతడు.. ఇప్పుడు ఢిల్లీ తరఫున శతక్కొట్టాడు. అంతేకాదు ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన నాలుగో క్రికెటర్‌గా, రెండో భారతీయుడిగా ఈ డాషింగ్ బ్యాటర్ ఘనత సాధించాడు.అంతర్జాతీయ టీ20ల పరంగా చూస్తూ.. రాహుల్‌కు ఇది ఏడో వంద కావడం విశేషం. అంతేకాదు పొట్టి క్రికెట్‌లో అత్యంత వేగంగా 8 వేల పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. 224 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనతకు చేరువైన రాహుల్.. విరాట్ కోహ్లీని అధిగమించాడు. విరాట్ 243 ఇన్నింగ్స్‌ల్లో 8వేల క్లబ్‌లో చేరాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ విధ్వంసక ఓపెన్ క్రిస్ గేల్ టాప్‌లో ఉన్నాడు.






# షష్టి పూర్తి’ నుంచి కొత్త పాట విడుదల!

సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్, అర్చన జంటగా నటిస్తున్న చిత్రం ‘షష్టి పూర్తి’. దాదాపు 38 ఏళ్ల తర్వాత ‘లేడీస్ టైలర్’ హిట్ పెయిర్ మరోసారి కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మరో క్రేజీ పాటను మేకర్స్ విడుదల చేశారు.వేయి వేణువుల అంటూ సాగిన ఈ పాటలో రాజేంద్రప్రసాద్, అర్చనల మధ్య సన్నివేశాలు చూపించారు. వారిద్దరి కెమిస్ట్రీ చాలా బాగా కుదిరిందని తెలుస్తోంది. కార్తీక్, విభావరి ఆప్టే జోషి కలిసి పాడిన ఈ పాటకు చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించగా.. ఇళయారాజా సంగీతం సమకుర్చాడు. పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రూపేష్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇందులో రూపేష్, ఆకాంక్షా సింగ్ మరో జంటగా కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన లవ్ ట్రాక్ మరియు మెలోడీ సాంగ్స్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా విడుదలైన పాట ‘షష్టి పూర్తి’ వేడుకలోని సందడిని తెలియజేస్తోంది. ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఇళయరాజా సంగీతం అందించడం విశేషం. ‘షష్టి పూర్తి’ చిత్రం మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అగ్గిపుల్ల అని ఆటపట్టించారు..



సినిమాల్లో కన్నా.. సోషల్ మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తుంది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే. నెపోటిజం.. కాస్మెటిక్ సర్జరీ.. బాడీ షేమింగ్.. ఇలా నిత్యం ఏదో ఒక టాపిక్‌తో వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. తాజాగా, కెరీర్ తొలినాళ్లలో చాలామంది హీరోయిన్లలానే తానుకూడా బాడీ షేమింగ్‌ను ఎదుర్కొన్నాననీ చెప్పుకొచ్చింది. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. “నేను చాలా చిన్న వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. ఆ 18 – 19 ఏళ్ల వయసులో నేను చాలా సన్నగా ఉండేదాన్ని. దాంతో ఇండస్ట్రీలో చాలామంది నా శరీరంపై కామెంట్స్ చేశారు. అగ్గిపుల్లలా ఉన్నానంటూ ఆటపట్టించారు.‘నీ కాళ్లు కోడికాళ్లలా ఉన్నాయి. నీ శరీరం కూడా సరైన ఆకారంలో లేదు’ అంటూ కామెంట్స్ చేశారు. ఇప్పుడేమో నా శరీరం సహజంగానే మారుతుంటే.. ‘ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంది’ అంటున్నారు. ఆడవాళ్లు ఎలా ఉన్నా.. ఇలాంటి విమర్శలు కామన్. కాబట్టి, పట్టించుకోకుండా మన పని మనం చేసుకుంటూ పోతేనే.. విజయం సాధిస్తాం!” అంటూ చెప్పుకొచ్చింది అనన్య. ఇక మగవాళ్లపై బాడీ షేమింగ్ విమర్శలు చాలా తక్కువగా ఉంటాయనీ, ఒకటో రెండో వచ్చినా.. వారిని అంతగా ఇబ్బంది పెట్టరనీ అంటున్నది. అదే, మహిళా నటులపై తరచుగా విమర్శలు గుప్పిస్తూనే ఉంటారనీ, వారిని ఎదగనీయకుండా అడ్డుకుంటారనీ ఆవేదన వ్యక్తం చేసింది. బాలీవుడ్ నటుడు చుంకీ పాండే కూతురిగా ఇండస్ట్రీలోకి వచ్చింది అనన్య. 2019లో వచ్చిన ‘స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2’ చిత్రం ద్వారా బాలీవుడ్ బాట పట్టింది. తొలి సినిమాలోనే తనదైన నటనతో అలరించింది. ఆ తర్వాత.. పతి పత్నీ ఔర్ వో, ఖాలీ పీలీ, రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ, డ్రీమ్ గర్ల్ 2, ఖో గయే హమ్ కహా లాంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇటీవలే అక్షయ్ కుమార్ సరసన కేసరి – చాప్టర్ 2లో కనిపించింది. ప్రస్తుతం లక్ష్య సరసన ‘చాంద్ మేరా దిల్’ కోసం సిద్ధమవుతున్నది అనన్య. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సోని దర్శకత్వం వహిస్తున్నాడు.


# మె అద్భుతమైన అమ్మ!

తన కూతురు అతియా శెట్టిని.. ‘ఓ అద్భుతమైన అమ్మ!’గా వర్ణిస్తున్నాడు బాలీవుడ్ వెటరన్ స్టార్ సునీల్ శెట్టి. ప్రసవ సమయంలో సి–సెక్షన్‌కు బదులుగా నార్మల్ డెలివరీని ఎంచుకున్న తన బిడ్డను చూస్తే ఎంతో గర్వంగా ఉన్నదని అంటున్నాడు. సునీల్ శెట్టి కుమార్తె అతియా శెట్టి ఈ ఏడాది మార్చిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, ప్రసవం కోసం అతియా ‘నార్మల్ డెలివరీ’ జరగాలని నిర్ణయం తీసుకున్నది. ఈ విషయంపై సునీల్ శెట్టి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అతియాపై ప్రశంసలు కురిపించాడు. “ఇప్పుడు చాలామంది సిజేరియన్ ద్వారానే పిల్లల్ని కంటున్నారు.నొప్పుల బాధలేకుండా.. సౌకర్యాన్ని మాత్రమే కోరుకుంటున్నారు. అలాంటి సమయంలో నా బిడ్డ.. సహజ ప్రసవాన్ని ఎంచుకున్నది. ఆమె ఎంతో ధైర్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయం మమ్మల్నే కాదు.. డాక్టర్లను కూడా ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. నా బిడ్డ.. ఎంతో ఎదిగింది” అంటూ అతియాను ఆకాశానికి ఎత్తేశాడు. ఇక తన బిడ్డను అద్భుతమైన తల్లిగా అభివర్ణిస్తూ.. “ఆమె తల్లి మానాశెట్టి కూడా ఎంతో దృఢమైన మహిళ. అతియా ఆమె నుంచే అన్నీ నేర్చుకున్నది. ఎలాంటి సందర్భంలోనైనా ముఖంలో అలసట, ఒత్తిడి అనేది లేకుండా.. చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది. బిడ్డగానే కాదు.. తల్లిగానూ తప్పకుండా సక్సెస్ అవుతుంది” అంటూ చెప్పుకొచ్చాడు. అయితే, “అతియా నార్మల్ డెలివరీని తట్టుకుంటుందా? అని నేనుకూడా మొదట్లో అనుమానపడ్డా. కానీ, ఆమె మాత్రం తన బిడ్డను సహజంగానే ఈ లోకంలోకి తీసుకురావాలని కోరుకుంది. ఆమె ఆలోచన ఎంతో గొప్పది” అంటూ వెల్లడించాడు. 2015లో నిఖిల్ అద్వానీ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ యాక్షన్ చిత్రం ‘హీరో’తో నటనా రంగ ప్రవేశం చేసింది అతియా. ఆ తర్వాత ముబారకన్, మోతీచూర్ ఛాక్నచూర్ లాంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నది. 2023లో తన స్నేహితుడు, భారత జట్టు క్రికెటర్ కేఎల్ రాహుల్‌ను వివాహం చేసుకున్నది.




# కౌంట్ డౌన్ షురూ.. 40 రోజుల్లో ‘కన్నప్ప’..

## కొత్త పోస్టర్ రిలీజ్



టాలీవుడ్ డైనమిక్ స్టార్ మంచు విష్ణు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న చిత్రం ‘కన్నప్ప’ ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తోంది. ఇదివరకే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లు, పాటలు సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి.తాజాగా, మేకర్స్ ఈ చిత్రం నుంచి కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో శివుడి పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ అద్భుతమైన లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. “జూన్ 27న ‘కన్నప్ప’ మీ ముందుకు వస్తోంది. ఇంకా కేవలం 40 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి” అంటూ మంచు విష్ణు ఈ పోస్టర్‌ను తన ‘ఎక్స్’ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రెబల్ స్టార్ ప్రభాస్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. అంతేకాకుండా, మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి ప్రముఖ తారాగణం ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘కన్నప్ప’ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# బుర్జ్ ఖలీఫాపై ‘హరిహర వీరమల్లు’ ట్రైలర్ ప్లాన్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు జ్యోతికృష్ణ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం ‘హరిహర వీరమల్లు’ ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇటీవల మేకర్స్ మొదటి భాగం ‘హరిహర వీరమల్లు పార్ట్–1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్’ విడుదల తేదీని జూన్ 12గా అధికారికంగా ప్రకటించారు.తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. చిత్ర బృందం సినిమాను గ్లోబల్ స్థాయిలో ప్రమోట్ చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే ట్రైలర్‌ను వినూత్నంగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దుబాయ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫా భవనంపై ‘హరిహర వీరమల్లు’ ట్రైలర్‌ను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంపై తెలుగు సినిమా ట్రైలర్ విడుదల కావడం ఇదే తొలిసారి కానుంది. ఇంతకుముందు బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ నటించిన ‘జవాన్’ సినిమా ట్రైలర్‌ను బుర్జ్ ఖలీఫాపై విడుదల చేశారు. ఒకవేళ ‘హరిహర వీరమల్లు’ ట్రైలర్ బుర్జ్ ఖలీఫాపై విడుదలయితే, ఈ ఘనత సాధించిన మొట్టమొదటి తెలుగు సినిమాగా ఇది రికార్డు సృష్టిస్తుంది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492